

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## కోతుల బెడదను నివారించాలి

చిలిపిచెడ్, ఏప్రిల్ 10: చిలిపిచెడ్‌లో కోతుల బెడద చాలా ఎక్కువగా ఉందని, మనుషులపై దాడి చేస్తున్నాయని, వెంటనే అరికట్టాలని పాడెపు పండరి, గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సింధూజకు వినతి పత్రం అందజేశారు. కోతుల బారిన పడి 25 నుంచి 30 మంది తీవ్రంగా గాయాల పాలైయ్యారని, వారు సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

## రాజీవ్ యువ వికాసానికి 1345 దరఖాస్తులు

రామాయంపేట, ఏప్రిల్ 10: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి మండల వ్యాప్తంగా 1345 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో షాజులుద్దీన్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగులు ఉంటే ఈనెల 14వ తేదీ వరకు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 14వ తేదీ దాటితే ఈ అవకాశం ఉండదని, దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## క్రీడలు ఆరోగ్యాన్ని అందజేస్తాయి



చేగుంట, ఏప్రిల్ 10: క్రీడలతో ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి పేర్కొన్నారు. చేగుంటలోని పలువురు క్రీడకారులకు గురువారం పరంజ్యోతి క్రికెట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాములు, బంటి, తలారి శ్రీనివాస్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్‌ను పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నిజాంపేట/రామాయంపేట/మెదక్‌రూరల్, ఏప్రిల్ 10: నిజాంపేట మండలంలోని చల్మెడలో రూ.237.73 లక్షల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు గురువారం భూమిపూజ చేశారు. నిజాంపేటకు వెళ్లిన ఎమ్మెల్యే తిరుగు ప్రయాణంలో రామాయంపేట శివారులోని కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లకు రోడ్డు వేయించాలని ఎమ్మెల్యేకు కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. మెదక్ మండలంలోని బాలనగర్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్‌తో కలిసి ప్రారంభించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



వంటలు పరిశీలిస్తున్న ఆర్డీవో

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 10: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లోని నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలకు మెనూ సక్రమంగా అమలు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

## విజయయాత్ర కరపత్రం ఆవిష్కరణ

రామాయంపేట, ఏప్రిల్ 10: రామాయంపేటలోని వీరహనుమాన్ విజయయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. పట్టణంలోని విశ్వహిందూ నరిషత్, బజరంగ్‌దల్ అధ్వర్యంలో వివేకానంద ఆవాస విద్యాలయంలో ఈనెల 12న జరిగే వీర హనుమాన్ విజయయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బియ్యం పంపిణీకి నిధులు కేంద్ర ప్రభుత్వానివే..

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 10: పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం నిధులు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవేనని బీజేపీ మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా పేదల సంక్షేమం కోసం కోట్లాది నిధులను కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వెచ్చిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులు కేంద్రానికి సంబంధించినవని చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

## వరి కోత మిషన్ డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి



సూచనలు ఇస్తున్న ఏవో స్వప్న

కౌడిపల్లి, ఏప్రిల్ 10: వరి కోత మిషన్ నడిపే సమయంలో డ్రైవర్లు మిషన్‌ను డ్రైవర్లు మిషన్‌ను బి2 గేర్‌లో నడుపుతూ బ్లోయర్‌ను ఆన్‌లో ఉంచి 18–20 ఆర్‌పీ ఎంతో తమ మిషన్‌ను నడపాలని ఏవో స్వప్న జాదవ్ సూచించారు. గురు వారం మండలంలోని వెల్మకన్న గ్రామంలో వరి పంట కోతలు పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ వరి కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమెతో ఏఈవో సాహితి ఉన్నారు.

## పరిస్థితి విషమించి వ్యక్తి మృతి



ఎల్లయ్య ఫైల్

కొల్చారం, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన వ్యక్తి ఒరడి ఎల్లయ్య(50) బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో జోగిపేట– మెదక్ రోడ్డు దాటుతుండగా జోగిపేట నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై అతివేగంగా వస్తున్న వ్యక్తి ఎల్లయ్యను ఢీకొట్టాడు. దీంతో ఎల్లయ్య తల వెనుక భాగంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు, అక్కడి నుంచి గాంధీకి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## గిరిజన జన సమితి రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్

చిలిపిచెడ్, ఏప్రిల్ 10: బంజారా సామాజిక వర్గానికి మంత్రి పదవి కేటాయించాలని కోరుతూ గురువారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వెళ్తున్న గిరిజన జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్ నాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని రహీంగూడ తండాకు చెందిన వినోద్ నాయక్‌ను ఇంటి వద్ద ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# సభకు దండులా తరలిరావాలి



కర్నాల్‌పల్లిలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి




శివ్వంపేట: దంతాన్‌పల్లిలో ఇంటి గోడకు వేసిన చలో వరంగల్ వాల్ రైటింగ్



శివ్వంపేట: దంతాన్‌పల్లిలో చలో వరంగల్ వాల్ రైటింగ్ ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- గ్రామాల్లో చలో వరంగల్ వాల్ రైటింగ్

చేగుంట, ఏప్రిల్ 10: వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు దండులా తరలిరావాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపుచ్చారు. మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లి సమీపంలో గురువారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చేలా కృషి చేయాలన్నారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, ముదాం శ్రీనివాస్, మంచికట్ల శ్రీనివాస్, శ్రీనివాస్, తానీషా, సిద్దిరెడ్డి, సిద్దిరాములు, మోహన్‌రాథోడ్, పట్నం తానీషా, నెల్లూర్, మమ్మద్ అలీ, హోలియనాయక్, రాములు, అంజిరెడ్డి, నందం, రాజు, రమేశ్, మో హన్‌రెడ్డి, గణేశ్, రాములు, బోనగిరి నర్సింహులు, భిక్షపతి పాలొన్నారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, ఏప్రిల్ 10: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని దంతాన్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ కోరారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదేశానుసారం మండలంలోని ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వాల్‌రైటింగ్ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మాజీ సర్పంచ్‌లు కన్నారం దుర్గేశ్, పూల అర్జున్, శంకర్‌యాదవ్, మధు, దంతాన్‌పల్లి గ్రామస్తులు ఉన్నారు.

## బీవీఆర్ఐటీలో జాతీయ టెక్నికల్ ఫెస్ట్



జాతీయ టెక్నికల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ లక్ష్మీప్రసాద్

నర్సాపూర్, ఏప్రిల్ 10: నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీ కళాశాలలో జాతీయ టెక్నికల్ ఫెస్ట్ సదస్సును గురువారం ప్రోమేథీయన్ ప్రారంభమైంది. కార్యక్రమంలో బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్ హాజరై మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థుల సాంకేతిక విజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, ప్రతిభ వెలికితీసే కార్యక్రమంగా ప్రోమేథియన్ పేరెన్నికగన్నదన్నారు. విద్యార్థుల విజ్ఞానాన్ని ఉత్తమ ఆలోచనలు, వృత్తి సాంకేతిక నైపుణ్యాలు, మార్పును ప్రేరేపించే టెక్నికల్ ఫెస్ట్ ప్రోమేథియన్–2025 ముఖ్య ఉద్దేశమని, విద్యార్థులను సరికొత్త సాంకేతికత, జ్ఞానోదయం చేసి పారిశ్రామికవేత్తలుగా, ఉన్నత విద్యా ఉద్యోగాలు పొందేందుకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ రకమైన సాంకేతిక కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. ప్రామేథియన్ కన్వీనర్ డా.విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక సదస్సుల ద్వారా విజ్ఞానాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల నెట్ వర్కును పెంపొందించుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ జాతీయ టెక్నికల్ సదస్సుకు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. బిట్స్ పిలాని హైదరాబాద్, జేఎన్‌టీయూహెచ్, సీబీఐటీ, ఎంజీఐటీ, వాసవీ ఇంజినీరింగ్ కళాశాల, వీఎన్ఆర్, బీవీఆర్ఐటీ హైదరాబాద్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల, గోకరాజు గంగరాజు మొదలైన కళాశాలల నుంచి దాదాపు 1128 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. డీన్ అకాడమిక్స్ డా.జగన్, డా.మురళీకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, మేనేజర్ బాపిరాజు, ఏఏవోలు సురేశ్ పాల్గొన్నారు.

## ఉరేసుకున్న వ్యక్తి సీపీఆర్‌తో ప్రాణం కాపాడిన కానిస్టేబుల్





సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ విష్ణువర్దన్‌రెడ్డి
పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్న రాజు భార్య

శివ్వంపేట, ఏప్రిల్ 10: ఉరేసుకున్న వ్యక్తికి కానిస్టేబుల్ సీపీఆర్ చేయడంతో శ్వాస తీసుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవమ్మగూడెం తండాలో బుధవారం రాత్రి లున్సావత్ రాజు (30) మద్యం తాగి గొడవ చేస్తుండడంతో కుటుంబీకులు డయల్ 100కు కాల్‌చేశారు. వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లడంతో అప్పటికే లున్సావత్ రాజు ఇంట్లో తలుపులు పెట్టుకుని ఉరేసుకున్నాడు. పోలీసులు తలుపులు పగలగొట్టి ఉరేసుకుని ఉన్న రాజును కిందకు దించారు. ఊపిరి తీసుకోకపోవడంతో కానిస్టేబుల్ విష్ణువర్దన్‌రెడ్డి సీపీఆర్ చేశాడు. దీంతో ఊపిరి తీసుకున్న లున్సావత్ రాజును వెంటనే పోలీసు కారులో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని తెలిపారు. లున్సావత్ రాజు భార్య మాట్లాడుతూ సీపీఆర్ చేసి తన భర్త ప్రాణాలు కాపాడిన శివ్వంపేట పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నిజాంపేట, ఏప్రిల్ 10: రాంపూర్‌కు చెందిన స్వామిగౌడ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5 వేలతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మణ్‌గౌడ్, బొమ్మగౌడ్, యాదాగౌడ్, బాల్‌రాజుగౌడ్, రాజునాయక్, బాబునాయక్, మహేందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.



### రామాయంపేటలో..

రామాయంపేట, ఏప్రిల్ 10: దామరచెర్వుకు చెందిన దండు అశోక్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మోహన్‌నాయక్ రూ.5 వేల ఆర్థిక సాయం 25కిలోల బియ్యం అందజేశారు. అక్షయ్, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, దుర్గయ్య, రవి, ప్రకాశ్, అనంత్, బాబురావు, మెట్టు ప్రకాశ్, కరుణాకర్ ఉన్నారు.

## పారదర్శకంగా తూకం వేయాలి

**కలెక్టర్ రాహుల్‌రాజ్**



మెదక్‌రూరల్, ఏప్రిల్ 10: ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉం డాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మెదక్ మండలంలోని పాతూరులో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వెల్లడించారు. తేమ 17 శాతం ఉండేలా చూసుకుని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలకు రూ2320, సాధారణ రకానికి రూ2300నిర్ణయించినందన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఏపీఎం ఇందిర ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్‌రూరల్, ఏప్రిల్ 10: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని శివాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ 500 బోనాస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ఇలా.. నడిచేదెలా?



రామాయంపేట రూరల్: దెబ్బతిన్న రోడ్డు వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న యువకులు



రామాయంపేట: పురపాలిక పరిధిలోని గిరిజన తండాకు వెళ్లే కంకర రోడ్డు



రామాయంపేట రూరల్: లక్ష్మాపూర్ చెరువు కట్ట వద్ద దెబ్బతిన్న బీటీ రోడ్డు

- నిధుల్లేవంటూ మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- కంకర రోడ్డుతో ప్రమాదాల బారిన గిరిజనులు
- అధ్వానంగా గ్రామీణ ప్రాంత రోడ్లు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



గుంతల మయంగా మారిన దంతేపల్లి వద్ద రోడ్డు
కోమటిపల్లి గిరిజన తండాలో కంకర తేలిన రోడ్డు

రామాయంపేట/రామాయంపేట రూరల్, ఏప్రిల్10: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చాలా గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు, గిరిజన తండాలకు వెళ్లే మట్టి రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడ్డ రోడ్లలో కనీసం మట్టిని కూడా పోయడం లేదు. లక్ష్మాపూర్ నుంచి కాట్రియాల, పర్వతాపూర్, దంతేపల్లి గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు, గిరిజన తండాలు, మొత్కుల తండా, లాక్యాతండా, తీన్‌నెంబర్ తండా, సుభాష్ తండా, రాంచందర్ నాయక్ తండా, కాట్రియాల తండాలకు వెళ్లే మట్టి రోడ్లు కూడా గుంతలమయంగా మారాయి. ఈ మార్గాల నుంచి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చాలా మంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు.

### పురపాలక పరిధిలోనూ అంతే..


రామాయంపేట పురపాలిక పరిధిలో నడవలేని దయనీయ స్థితిలో రోడ్లు ఉన్నాయి. కోమటిపల్లి గిరిజన తండాకు కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. రెండేండ్ల క్రితం గిరిజన తండాకు కోటిన్నరతో బీటీ రోడ్డుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసి, పనులు మొదలు పెట్టింది. కోమటిపల్లి నుంచి గిరిజన తండా వరకు కంకర పనులు చేపట్టింది. తీరా ప్రభుత్వం మారింది. దీంతో శిలాఫలకం శంకుస్థాపనకే పరిమితమైంది. తండా వరకు కంకర పరిచిన సదరు కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదంటూ పత్తా లేకుండా పోయాడు.

### తండాలపై చిన్న చూపు చూస్తుండ్రు

మా తండాకు ఇప్పటి వరకు బీటీ, సీసీ రోడ్డు లేదు. ఉన్న మట్టి రోడ్డు కూడా గతంలో మంచిగా ఉండేది. ఈ మధ్య కాలంలో గుంతలుగా తయారైంది. వ్యవసాయ ప్రాంతం ఎక్కువ ఉండటంతో వాహనాలు ఎక్కువ నడుస్తాయి. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకూ తెలుసు. ఈ రోడ్డు గురించి పట్టించుకుని శాశ్వత పరిష్కారం చూపడానికి ముందుకు రావడం లేదు. గతంలో మట్టి రోడ్డు అయినా మంచిగా ఉండేది.

**- గోపాల్, తీన్ నెంబర్ తండా**


### నిధుల్లేవంటూ కాంట్రాక్టర్ వెళ్లిపోయిండు



కంకర పరిచిన కాంట్రాక్టర్ నిధులు లేవంటూ పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయిండు. రోడ్డుపై నుంచి నడవాలంటేనే కాళ్లు బొబ్బలెక్కుతున్నాయి. ఎన్నికలప్పుడు హామీలు కురిపించే నాయకులు ఇప్పుడు పనులు చేయడంలో మాత్రం తండాకు రారు. తండాకు వచ్చి మా బతుకులు చూడాలి అప్పుడు మా బాధలు తెలుస్తాయి.

**- చత్రియా నాయక్, తండావాసి**

### అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి



మాది మారుమూల గ్రామం దంతేపల్లి. ఇతర గ్రామాలకు వెళ్లి మా గ్రామానికి లక్ష్మాపూర్ మీదుగా రావడానికి రోడ్డు గుంతలుగా మారడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. లక్ష్మాపూర్ నుంచి దంతేపల్లి చేరే వరకు తలప్రాణం తోకకొస్తున్నది. పక్కన గుంతలు, కొన్ని ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి.

**- నక్కిర్తి సాయిలు, దంతేపల్లి**

## కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు

నర్సాపూర్, ఏప్రిల్ 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు మండిపడ్డారు. గురువారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడాన్ని, డీజిల్‌లపై ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని విధించడాన్ని ఖండించారు. దీంతో పేద ప్రజలపై 7 వేల కోట్ల భారం పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రజల జీవితాలు భారంగా మారాయని, తాజాగా ధరల పెంపుతో తీవ్రమైన ప్రభావం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు తగ్గిన నేపథ్యంలో ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించడానికి బదులుగా ప్రభుత్వం అదనంగా భారాలు మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సమ్మ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 10: మధ్యాహ్న భోజన కార్మికులు నాలుగు నెలలుగా పెండింగ్‌లో గల వేతనాలు బిల్లులు, మెనూ బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించకపోతే విద్యార్థులకు ఎలా వంట చేసి పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వసిస్తున్నారని, వేసవి సెలవు దగ్గరకొస్తున్నాయని ప్రభుత్వం ఎప్పుడు పెండింగ్ బిల్లులు చెల్లిస్తుందో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మి, గోదావరి, బీబీ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు 3.5 లక్షల ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్ అందజేస్తున్న జెనోటిక్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులు

శివ్వంపేట, ఏప్రిల్ 10: మండలంలోని ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాలకు మేడ్చల్ తుర్కపల్లికి చెందిన జెనోటిక్ ల్యాబొరేటరీస్ పరిశ్రమ రూ.3.5 లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను హెచ్ఆర్ కె.శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ అబ్దుల్‌గఫార్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి అం దజేశారు. పాఠశాలకు ఎల్ఈడీ టీవీ, ఫర్నిచర్, ఆట వస్తువులు అం దజేసినట్టు తెలిపారు. అనంతరం పాఠశాలకు ఎంఈవో బుచ్యానాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుర్రం సురేందర్‌రెడ్డి, టీచర్లు సాయిలత, బీఆర్ఎస్ సీనియర్ నాయకు లు కృష్ణారావు, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, వేణుకుమార్, గోపాల్, కుందనపల్లి కృష్ణ, కోట కృష్ణ, జయవంత్, ప్రవీణ్, భాను, ప్రశాంత్ ఉన్నారు.

## వర్షాపాతం నమోదు పరికరాల పరిశీలన



వర్షపాతం నమోదు మ్యానువల్ రెయిన్ గేజ్‌ని పరిశీలిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10: వర్షపాతం నమోదు చేసే మ్యానూవల్ రెయిన్‌గేజ్, వాతావరణ నమోదు పరికరాలను చిన్నశంకరంపేటలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, తహసీల్దార్ మన్నన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. యంత్రాల పని తీరును పరీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో యంత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా డిప్యూటీ గణాంకాల అధికారి రవి, ఏఎస్‌వో ఏలియా ఉన్నారు.

## లైట్లు బాగు చేయించాలని వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కౌడిపల్లి, ఏప్రిల్ 10: కౌడిపల్లిలోని జాతీయ రహదారిపై ఉన్న స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని, వెంటనే బాగు చేయించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా రహదారిపై ఉన్న లైట్లు పనిచేయక రాత్రి సమయంలో రోడ్డుపై చిమ్మ చీకటి కమ్ముకొని గ్రామస్తులు,వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతుడుతూ అందకారం నెలకొందన్నారు. రహదారిపై రాత్రి సమయంలో ప్రజలు రోడ్డు దాటుతుండగా ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాత్రి సమయంలో రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల్లో సైతం దొంగతనాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. ఈ విషయమై ఎన్నో సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి అధికారులతో చర్చించి పని చేయని స్ట్రీట్ లైట్లను బాగు చేయించాలన్నారు. కార్యక్రమంలో కౌడ శ్రీనివాస్ గుప్తా, ముకేశ్, సంజీవ్, జక్కి ఉన్నారు.

## విలేకరిపై ఎక్సైజ్ అధికారి కారు డ్రైవర్ జులుం

కొల్చారం, ఏప్రిల్ 10: వార్తా కవరేజ్‌కి వెళ్లిన విలేకరిపై ఎక్సైజ్ అధికారి కారు డ్రైవర్ జులుం సాగిస్తూ ఫోన్ లాక్కున్న ఘటన రంగంపేట గ్రామంలోని వైన్స్ వద్ద గురువారం జరిగింది. మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వర రావు, మరో ఎస్సై, సిబ్బందితో కలిసి రంగంపేట వైన్స్‌లో తనిఖీలు నిర్వహించడానికి గురువారం వచ్చారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ విలేకరి ఫొటోలు తీశాడు. దీంతో సీఐ అద్దెకారు డ్రైవర్ సదరు విలేకరిపై జబర్దస్తీ సాగిస్తూ ఫోన్ లాక్కున్నాడు. విషయం తెలుసుకున్న పలువురు విలేకరులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ తీరును తప్పుబట్టారు. ఫోన్ లాక్కోవడంపై ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించగానే వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అధికారులు తనిఖీలకు వెళ్లే సమాచారం వైన్స్ దుకాణాల యజమానులు, కల్లు దుకాణాల యజమానులకు చేరవేస్తూ మధ్యవర్తిగా వ్యవహరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నాడని గతంలో ఆరోపణలున్నాయి. అధికారులతో గోదాంలోకి వెళ్లి తనిఖీలు చేయడం గతంలో వచ్చిన ఆరోపణలకు బలం చేకూర్చినట్లయింది.